**మనసుకు ఊహించేశక్తి ఉంది. ఆ శక్తే ఒకొక్కసారి బలహీనత కూడా అవుతుంది. ఒక్క చిన్న అనుమానంతో జీవితవిహంగం నిశ్చలంగా పయనిస్తున్న విశుద్ధవిహాయసంలో ప్రళయ ఝంఝూ ప్రభంజనలు వీస్తాయి. అందుకే కాబోలు అన్నారు—'అవశ్యమను భోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్' అని!**

# సంజ చీకట్లు

## వై. రఘునాథరావు

సంజ చీకట్లు క్రమంగా కమ్ముకుంటున్నాయి. పరిసరాలలో ఉన్న ప్రకృతి కునుకుతున్నది. వెనకబడిపోయిన పిట్ట ఒకటి ఒంటరిగా కేకలు వేస్తూ తన గుంపును ఆకాశవీధుల్లో వెదుక్కుంటున్నది. నది ఒడ్డున ఒంటికాలు తపస్సులో ఉన్న ఒక మహాముని తటాలున ముక్కు నీటిలో గుచ్చి ఒక పెద్ద చేపను చిక్కించుకొని రెక్కలు రెపరెపలాడిస్తూ నీటి అంచులమీద ఎగురుతూ అవతలి తీరానికి పోయింది.

నది ఒడ్డున సిమెంటు బెంచిమీద మేమిద్దరమే ఉన్నాము. చాలా సేపటివరకూ ఎవరమూ మాట్లాడలేదు. చివరకు ఆ నిశ్శబ్ద వాతావరణాన్ని భరించలేక నేనే పెదవి విప్పాను.

"ఆరర్, నేను ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేస్తున్నాను" అన్నాను తాపీగా. ఆర్థర్ ఈ మాటలను పట్టించుకోలేదు. నోట్లో ఉన్న సిగరెట్టు పీకను పక్కకు పారేసి మరొకటి ముట్టించాడు.

"నవ్వుతాలు కాదు. ఈ మాట నీతో చెబుదామని కొద్ది రోజులుగా అనుకుంటున్నాను. నేను రాజీనామా ఇచ్చెయ్యడం నిశ్చయం."

"సరే. రాజీనామా ఇచ్చేసిన తర్వాత ఏం చేస్తావు?" అన్నాడు.

"ఇంటికిపోయి కొన్ని నెలలు విశ్రాంతి తీసుకుంటాను."

"తర్వాత?"

"మళ్ళీ ఉద్యోగ ప్రయత్నం చేస్తాను."

"ఇప్పుడు నువ్వు చేస్తున్న ఈ ఉద్యోగం సంపాదించడానికి నీ కెంతకాలం పట్టింది?"

ఈ ప్రశ్నకు నేను సమాధానం ఇవ్వలేదు. ఆర్థర్ వదిలిపెట్టదలుచుకోలేదు.

"నీకు ఎనిమిది నెలలు పట్టింది. మళ్ళీ ఆ నిరుద్యోగపు రోజులు గడపాలని ఉందా?"

"ఏదైనా సరే; ఎటువంటి జీవితం అయినా సరే. ఈ బావిలోనుంచిమాత్రం బయట పడాలి. లేకపోతే నేను రోజుల్లో ఆఖరికి ఎవరినైనా ఖూనీచేసి జైల్లోనో, లేక ఏ పిచ్చాసుపత్రిలోనో చేరిపోవలసి వస్తుందేమో!"

"టట్. టట్. నీపట్ల నువ్వు ఊరికే సానుభూతి చూపించుకోకు. నేను మిల్లులో గత మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్నాను. నాకే మాత్రం పిచ్చెక్కింది? ఇందులో ఇన్నివేల మంది కూలివాళ్ళూ, ఇంతమంది ఉద్యోగస్తులూ—వీళ్ళంతా ఎలా పని చేస్తున్నారు?"

"ఇక్కడ ఉన్నవాళ్ళ నరాల్లోని రక్తం అంతా నీరయిపోయి చాలాకాలం అయి ఉంటుంది. ఒక సినిమా లేదు; ఒక ఊరు లేదు. ఫాక్టరీ నుంచి ఇంటికి; ఇంటినుంచి ఫాక్టరీకి. ఒక వైపు గోమని గోలచేస్తూ ఇరవైనాలుగు గంటలూ నిర్విరామంగా ఈ రైలుబళ్ళు. ఈ హుగ్లీనది ఒడ్డున అయినా కాస్త గాలి పీల్చుకుందామంటే........" నేనింకా వాక్యం పూర్తి చెయ్యలేదు. బుంయ్‌మని బొంగురుగా ఈల ఊదుతూ ఒక పెద్ద స్టీమరు కలకత్తావైపు వెళ్ళుతున్నది. దాని పొగ గొట్టంలోనుంచి వస్తున్న దట్టమైన పొగ ఆ ప్రాంతాన్నంతటినీ ఆక్రమించింది. ఆ పొగను గాలి చెదరగొట్టేదాకా ఇద్దరమూ జేబురుమాళ్ళు ముక్కుకు అడ్డంగా ఉంచుకున్నాము.

"ఇది కూడా ఒక బతుకేనా?" నేను మళ్ళీ అందుకున్నాను. "లేదు, ఆర్థర్, నీ కర్థంకాదు. నువ్వూ నాలాగే నాలుగు దివ్యమైన సంవత్సరాలు యూనివర్సిటీ జీవితం అనుభవించి, ఒక్కసారిగా ఇటువంటి నరకంలోకి ఉరికితే అప్పుడు నీ కర్థం అవుతుంది నా బాధ. ఇవాళ పొద్దున ఏమయిందో తెలుసా? డ్యూటీకి మూడు నిమిషాలు ఆలస్యంగా వెళ్ళాను. సూపరింటెండెంటు నన్ను చాటుగా పిలిచి ఫాక్టరీలలో ప్రతి నిమిషం ఎంత విలువైనదో, నేను ఆలస్యంగా వచ్చిన ఈ మూడు నిమిషాలూ ఒక వేళ ఫాక్టరీ ఆగిపోయి ఉంటే కంపెనీకి ఎన్ని లక్షలు నష్టం వస్తుందో వివరిస్తూ ఒక అరగంట ఉపన్యాసం ఇచ్చాడు. ఇదే మా కాలేజీ అయిఉంటేనా....."

"కాదు. ఫాక్టరీకీ, కాలేజీకీ పోలుస్తావేమిటి? ఆ జీవితం వేరు; ఈ జీవితం వేరు. ఆ రోజుల్లో మీరందరూ మరొకరి సొమ్ము ఖర్చుపెడుతూ విజ్ఞానం కొనుక్కున్నారు. ఇప్పుడా విజ్ఞానాన్ని అమ్ముకుంటూ సొమ్ము సంపాదిస్తున్నారు. ఈ రెండిటికీ పోలిక ఎందుకు ఉండాలి? మరో విధంగా చెబుతాను. ఇక్కడ నీకు పరీక్షలు లేవు. ఈ డిగ్రీ పుచ్చుకున్న తర్వాత భావి జీవితం ఏమవుతుందో అన్న ఆందోళన లేదు. అన్నిటికన్నా ముఖ్యమైనది— నువ్వు ఒకరిని చెయ్యి చాపి నాకు సొమ్ము కావాలి అని అడిగి వ్యక్తిత్వాన్ని పోగొట్టుకోనక్కరలేదు."

నాకు కోపం వచ్చింది.

"నువ్వెన్ని చెప్పినా నా వాదనని సమాధానపరచగలవేమోగాని, మనస్సునిమాత్రం కాదు. ఒక్క సంగతి చెబుతాను విను, ఆర్థర్. మనలాటి మధ్య తరగతి కుటుంబికుల జీవితాలన్నీ ఇలా ధనాన్వేషణకి అంకితం అయిపోవాల్సిందే. ఈ రోజుల్లో సొమ్ము లేనిదే సుఖాన్ని కొనుక్కోలేము. ఆ సొమ్ముకోసం మన జీవితం అంతా అమ్ముకొని చివరకి దాన్ని అనుభవించేనాటికి శ్మశానవాటికకి మూడడుగుల దూరంలో ఉంటుంది మన వయస్సు."

"ఆగాగు. ఇప్పుడు నీకేం వచ్చిందని ఇంత అన్యాయంగా మాట్లాడుతున్నావు?"

"నా కో రేడియో ఉండాలి. రిస్ట్‌వాచ్ కొనుక్కోవాలని ఆరు నెలలుగా అనుకుంటున్నాను. మొన్ననే కలకత్తాలో ఒక షాపులో అరవై అయిదు రూపాయల పంట్లాం ఒకటి చూశాను...."

"ఇవన్నీ నీకు లేకపోతే నీ జీవితం గడవదా?"

"అది వేరే విషయం. ఇవన్నీ నాకు ఎందుకు లేకపోవాలి? వీటిని నేనెందుకు వదులుకోవాలి? నాకు సొమ్ము లేకపోబట్టే కదా? ఏ జమీందారీ కుటుంబంలోనో, ఏ కోటీశ్వరుడి ఇంట్లోనో పుట్టినవాళ్ళ సంగతి చూడు."

"నువ్వు చాలా తప్పుగా ఆలోచిస్తున్నావు. సొమ్ము ఉన్నంత మాత్రాన సుఖం కొనుక్కోగలం అన్నది ఒక భ్రాంతి. నీకన్నా జీవితంలో చాలా వసంతాలూ, హేమంతాలూ చూసినవాణ్ణి. అనుభవంమీదనేనుబాగాచెప్పగలను. ఈరెండింటికీ మధ్య చాలా పెద్ద అగాధం ఉంది. సిరి సంపదల్లో మునిగిఉన్నవాళ్ళ జీవితాలు నేను చాలా చూశాను. నా మాటలు నమ్ము. నువ్వూ, నేనూ వాళ్ళకంటే వెయ్యిరెట్లు హాయిగా బతుకుతున్నాము."

"నాన్సెన్స్! వాళ్ళకి అనుభవం చేతకాదు. అంతే."

"పోనీలే. మనకెందుకు, ఈ వాదన?"

"అలా కాదు. ఇప్పుడో లక్ష రూపాయలు ఆకాశం మీదినుంచి నా ఒళ్ళో పడ్డాయనుకో. అప్పుడు నేను రుజావుచేసి నీకు చూపిస్తాను" అన్నాను నవ్వుతూ.

ఆర్థర్ మరి మాట్లాడలేదు.

"ఏమంటావు?" అన్నాను.

అతడు జవాబియ్యలేదు. సిగరెట్టు పారేసి మరొకటి ముట్టించాడు. నాకు చాలా చికాకు వేసింది. మాట్లాడుతూ మాట్లాడుతూ, కీ అయిపోయిన వాచీలాగా టక్కున ఊరుకుంటాడేమిటి, ఈ మనిషి?

"ఏమంటావు?" అన్నాను మళ్ళీ గొంతు హెచ్చిస్తూ.

"ఏమిటి?" అన్నాడు.

"మాట్లాడవేం?" అన్నాను.

"అబ్బే. ఏమీలేదు."

"ఏమీ లేకపోవడమేమిటి, నీ ముఖం?" అన్నాను.

"అదికాదు. ఇందాక నువ్వన్న మాట వినగానే నాకో వ్యక్తి చప్పున జ్ఞాపకం వచ్చాడు."

# అతనూ అతని నీడలా



"ఎవరతను?" అడిగాను కుతూహలంగా.

ఆర్థర్ వెంటనే జవాబివ్వలేదు. లేస్తూ అన్నాడు: "అదో పెద్ద గాథ. నీకు మరొకప్పు డెప్పుడైనా చెబుతాను."

అతడి చెయ్యి పుచ్చుకొని కూర్చోబెటా ను— "ఇప్పుడింకా ఏడే అయింది. ఇంటికి వెళ్ళి ఏం చేస్తావు? ఇప్పుడే చెప్పు వింటాను" అంటూ.

అప్పటికి బాగా చీకటి పడింది. నది ఒడ్డున మైళ్ళకొద్దీ బారులు తీర్చిఉన్న ఎలక్ట్రిక్ దీపాల ప్రతిబింబాలు నల్లటి నీటిలో చలికి వణుకు తున్నాయి. మా వెనక సమీపంలో ఉన్న దర్వాజ్ల ఇళ్ళలో ఎవరో గొంతెత్తి పాడుతు న్నారు. నేను తొడుక్కున్న కోటును కొంచెం దగ్గరకి లాక్కొని ముడుచుకొని కూర్చు న్నాను.

ఆర్థర్ హెఫ్రాన్ ప్రారంభించాడు:

అయిదు సంవత్సరాల క్రితం మాట. నే నప్పుడు కలకత్తాలో పనిచేస్తూ ఉండేవాణ్ణి. నాకు ఆ రోజుల్లో జీవితం అంతా గులాబీ రంగులో కనిపిస్తుండేది. ఆ కంపెనీ లోనే మేరీ అని ఓ టైపిస్టు ఉండేది. ఆమెను నేను తరచు సినిమాలకు, నైట్ క్లబ్బులకు తీసుకొని వెళ్తూ ఉండేవాణ్ణి. మా ఇద్దరి పరి చయం క్రమంగా గాఢమై, చివరకు ఆమెను నేను అప్పుడప్పుడు ఏకాంతంలో సున్నితంగా ముద్దు పెట్టుకునేదాకా వచ్చింది. ఆమె అన్న బొంబాయిలో ఒక స్టీమరు కంపెనీలో పని చేస్తూ ఉండేవాడు. అతడికి కలకత్తా బదిలీ అయింది. అతణ్ణి స్టేషన్ నుంచి ఆహ్వానించ డానికి ఆమె, నేను హౌరా వెళ్ళాము. బొంబాయి మెయిలు ప్లాట్‌ఫారం మీద ఆగగానే అతనూ, మరొకతనూ దిగారు. రెండవవాడు నాకన్నా జెత్తెడు పొడుగు. దట్టమైన కనుబొమలు, గంభీరమైన ముఖం, జొన్నపొత్తు పీచులాటి జుత్తు, ఆకుపచ్చని కళ్ళు— మొదటి చూపులోనే అతడీ దేశస్థుడు కాడని స్పష్టంగా తెలిసింది.

ఉచిత చికిత్స

బొల్లి వగైరాలకు

మేము ఒక బుడ్డి మందు

ఉచితంగా యిస్తాము

వాడి చూడండి.

**ARUN PHARMACY, N.22**

P. O. Katrisarai (Gaya)



తెల్లజుట్టును

అంతమొందించండి

హెయిర్‌డైతో కాదు. సెంటు చేర్చబడినమా ఆయుర్వేద తలనూనె తెల్లజుట్టును నిగనిగలాడే నల్లజుట్టుగ చేస్తుంది. ఇది మెదడుకు, కళ్ళకు చలువనిస్తుంది. ఒకసారి వాడిచూడండి. మీరు పూర్తిగ సంతృప్తి పొందుతారు. వెల రు. 10 —లు. పూర్తి కోర్సు రు. 25 —లు.

**SHYAM AYURVED BHAVAN**
No. 51, P.O. Katri Sarai (Gaya)


# అతనూ, అతని నీడలూ

మేరీ అన్న మమ్మల్ని అతడికి పరిచయం చేశాడు. అతడి పేరు రికార్డొ గాస్పెరీ. ఇటలీ దేశస్థుడు. వ్యాపార నిమిత్తం ఈ దేశం వచ్చాడు. నలుగురం టాక్సీలో కూర్చున్న తర్వాత నేరుగా గ్రేట్ ఈస్టర్న్ హోటల్‌కు తీసుకువెళ్ళమన్నాడతడు. హోటల్ చేరిన తర్వాత ఓ పది రూపాయల కాగితం నిర్లక్ష్యంగా టాక్సీ డ్రైవరు మీదకు విసిరి ముగ్గురినీ ఓ చిన్న డ్రింకుకు ఆహ్వానించాడు. డ్రింకుతో ఆరంభమైన మా పార్టీ డిన్నరుతో అంతమయింది. ఆ రాత్రి మేము ముగ్గురం ఇళ్ళకు బయలుదేరే సరికి రాత్రి పదకొండు గంటలయింది.

దోవలో మేరీ అన్నను అడిగాను: "ఇంత విచ్చలవిడిగా సొమ్ము ఖర్చు పెడుతున్నాడేమిటి, ఈ మనిషి?"

"నన్నడగకు. నాకు నిజంగా తెలియదు. బొంబాయి నుంచి కలకత్తాదాకా ప్రయాణంలో ఎంత ఖర్చు పెట్టాడో నేను నీకు చెప్పినా, నువ్వు నమ్మవు. ఓ కప్పు టీతాగి రెండు రూపాయలనోటు వాడివాడికి విసిరేశాడు. ఒక అగ్గిపెట్టెకు రూపాయి ఇచ్చాడు."

"కోటీశ్వరుడేమో!" అన్నాను.

"ఏమో!" అన్నాడతడు.

ఆనాటి ప్రసంగం అక్కడితో ఆగిపోయింది. ఓ రెండు నెలల తర్వాత లైట్‌హౌస్ సినిమా హాలు దగ్గర రూపాయి పావలా క్యూలో నిలబడ్డాను నేను. నా భుజం మీద బరువుగా చెయ్యి ఒకటి పడితే ఎవరా అని వెనక్కు తిరిగాను. అతను! "జ్ఞాపకం ఉన్నానా?" అన్నాడు. అతణ్ని మరిచిపోయినా, గ్రేట్ ఈస్టర్న్ హోటల్‌లోని డిన్నరును ఎలా మరిచిపోగలను?

"హలో హలో!" అన్నాను నవ్వుతూ.

"పద" అన్నాడు.

"ఎక్కడికి?" అన్నాను.

నా రెక్క పట్టుకొని నన్ను జరజర బాల్కనీ మీదకు తీసుకుపోయాడు.

"ఇవాళ సినిమాకు నాలుగు టిక్కెట్లు తీశాను. ముగ్గురు స్నేహితులు ఎవరైనా కనుపిస్తారా అని వెదుకుతూ ఉంటే నువ్వొకడివి కనుపించావు. మిగతా ఇద్దరినీ వెతకాలి" అన్నాడు.

నాకు ఉడుకుమోత్తనం వేసింది. "క్యూలో నా వెనకాల ఉన్న ఇద్దరినీ పిలుచుకురానా?" అన్నాను వెక్కిరింతగా.

"హల్లో, రిక్!" అంటూ ఒకామె అలా అలా తేలుతూ మా దగ్గరకు వచ్చింది. ఆమె వెనకాలే మరో పిట్ట ఉంది. నలుగురం పూర్తయినాము. బాల్కనీమీద రెస్టారెంటులో మాకు సర్వ్ చెయ్యడానికి ముగ్గురు బేరర్లు పరుగెత్తుకుంటూ వచ్చారు. వాళ్ళకు ఎంతెంత సొమ్ము బక్షీష్‌గా విసిరాడో, ఈ మహానుభావుడు!

అర్ధరాత్రిదాకా నన్ను వదిలిపెట్టలేదతడు. సుమారు ఓ వంద రూపాయలు తగలేసిన తర్వాత నన్ను మా ఇంటి దగ్గర దిగబెట్టి ఆ ఇద్దరితోనూ ఎక్కడికో పోయాడు.

ఆ వారమే ఫిర్పో హోటల్‌లో పెద్ద కాక్‌టెయిల్‌పార్టీ ఒకటి ఏర్పాటుచేసి నాకో ఆహ్వానం పంపించాడు. మేరీ బాగా మేకప్ చేసుకొని నన్ను పిలవడానికి వచ్చింది. నేను రానన్నాను. ఆమెకు ఆశ్చర్యం వేసింది.

"ఎందుకు రావు?" అంది.

"వాడితో మనకేంపని? మనకీ, వాడికీ ఉన్న సంబంధం ఏమిటి? వాడు ఉత్త మూర్ఖుడే అనుకో— ఆ మూర్ఖత్వాన్ని ఉత్సాహపరచడం తప్పుకాదూ? వాడికి సొమ్ము అంత చేదయితే ఏదైనా ధర్మానికి దానం చెయ్యకూడదూ? ఇలా పోరంబోకులందరికీ పంచడం ఎందుకు?" అన్నాను.

ఆమెకు కోపం వచ్చింది. "అయితే మేమందరం పోరంబోకులమా, నువ్వొక్కడివే పెద్ద మనిషివి అన్నమాట" అంది.

"తప్పుతప్పు. నా అర్థం అది కాదు" అన్నాను.

"ఆ అర్థం నాకు తెలుసు. ప్రతినెలా ఆఖరి వారం వచ్చేసరికి నీ దగ్గర దమ్మిడీ ఉండదు. అందుచేత నీలాగే లోకం అంతా పొట్టలో కాళ్ళు పెట్టుకొని ముక్కుతూ గదిలో పడుకొని రోజులు గడపాలంటావు. రిక్‌లాటి విలాస పురుషులు జీవితాన్ని అంత హాయిగా అనుభవించడమేమా, అని నీ బాధ. అంతేనా?" అంది.

నాకూ ఒళ్ళు మండింది. "అయితే మిస్టర్ గాస్పెరీ అని పిలిచేదల్లా, రిక్ అని పిలిచేదాకా వచ్చిందన్నమాట వ్యవహారం!" అన్నాను.

ఈ విసురుకు ఆమె అరుస్తుందనుకున్నాను. నా మీదపడి నన్ను రక్కుతుందనుకున్నాను. ఆమె అలాటిదేమీ చెయ్యలేదు. ఆమె చెక్కిళ్ళు ఒక్కసారి ఎరుపెక్కాయి, అలా నా వైపు నిష్ఠురంగా కొన్ని క్షణాలు చూసి తలవంచుకొని విసవిసా వెళ్ళిపోయింది.

చలికాలం తడితువ్వాలుతో ముఖంమీద ఎవరో దిగ్గున కొట్టినట్టయింది నాకు. ఓ పది నిమిషాలదాకా మెదడంతా ఖాళీ అయిపోయి, ఏమీ తోచలేదు. తర్వాత తేరుకొని కప్పు టీ తాగి ఈ విషయం గురించి గట్టిగా చాలాసేపు ఆలోచించాను. కాని ఏ మార్గమూ కనిపించలేదు. ప్రపంచంలో చాలా విషయాలు అశాశ్వతం అని తెలిసినా, మేరీ ప్రేమమాత్రం శాశ్వతం అనుకున్నాను. ఇప్పుడు అదీ పోగొట్టుకున్నాను. ఇక నా ఒంటరి జీవితానికి మిగిలిందేమిటి? నేను సాధారణంగా బీర్ తప్ప మరేమీ తాగను. ఆ రాత్రి విస్కీ సోడా లేకుండా సగంసీసా ఖాళీచేసి పడుకున్నాను. మత్తుగా రాత్రల్లా నిద్ర




ఐటెక్స్ కాటుక

ఐటెక్స్ బిందీ (తిలకం)

శాస్త్రీయంగా తయారుచేయబడినవి

అరవింద్ లేబొరేటరీస్

పి. బి. నెం. 1415, మద్రాసు-17.

పట్టింది. తెల్లవారేసరికి తలదిమ్మూ, వాంతులూ పట్టుకున్నాయి. ఆఫీసుకు సెలవుపెట్టి ముసుగు తన్ని పడుకున్నాను.

సుమారు పదకొండు గంటలకు ఎవరో తలమీద కప్పుకున్న దుప్పటి తొలగించారు. నేను కళ్ళు చికిలించి చూస్తే, ఎదురుగా గాస్పెరీ నిలబడి ఉన్నాడు. నేను మళ్ళీ కళ్ళు మూసుకొన్నాను. లేచే ప్రయత్నాలేమీ చెయ్యలేదు. అతడు బలవంతంగా నన్ను కూర్చోబెట్టి, నా పక్కనే మంచంమీద తనూ కూర్చున్నాడు. నేను చాలా చికాకుగా "నన్ను పడుకోనీ" అన్నాను.

"పదకొండవుతోంది. ఇంకా నిద్దరేమిటి?" అన్నాడు.

"నా ఊసు నీకెందుకు? నీ ఖర్మాన నువ్వు పోరాదూ?" అన్నాను కోపంగా.

"అలా అంటే ఎలా అవుతుంది? నీతో చాలా జరూరు పని ఉండి వచ్చాను" అన్నాడు.

"నీ కెంత జరూరుపని ఉన్నా, నువ్వు నా కిప్పుడు లక్ష రూపాయలు ఇచ్చినా నే నిక్కడ నుంచి కదిలేది లేదు."

"పోనీ. లక్ష రూపాయ లిస్తాను. కదులు తావా?"

ఆ ఘటం నన్నిక వదలదని విధిగాలేచి ముఖం కడుక్కుని దుస్తులు వేసుకున్నాను. "ఏమిటా పని?" అన్నాను.

"రా, చెబుతాను" అన్నాడు.

బయట ఓ టాక్సీ ఉంది. అందులో వెనక సీటులో ఏదో గోధుమరంగు కాగితంతో పార్సెలు ఒకటి ఉంది. మేమిద్దరం అందులో కూర్చున్న తర్వాత "నిన్న పార్టీకి ఎందుకు రాలేదు?" అన్నాడు.

"ఒంట్లో బాగులేక" అన్నాను ముఖం తిప్పేసి.

"నా దగ్గర కొయ్యకు. పార్టీ అయిపోయిన తర్వాత మేరీ నాతో అంతా చెప్పేసింది" అన్నాడు నవ్వుతూ.

"ఎక్కడ? నీ పడకగదిలోనా?" అన్నాను అతనివైపు ఒక్కసారి కోపంగా తిరిగి.

రికార్డో మళ్ళీ నవ్వాడు. "నీకు నేనంటే ఎందుకు, అంత కోపం?" అన్నాడు తాపీగా.

"ఇదుగో, మిస్టర్ గాస్పెరీ! నువ్వు నీ సొమ్ముతో అందరినీ కొంటున్నట్టే నన్నుకూడా కొనగలననుకుంటున్నావేమో? అలా అనుకుంటే చాలా పొరబడుతున్నావు. ఈ ప్రపంచంలో సొమ్ముకన్నా విలువైనవి చాలా ఉన్నాయి. వాటి విలువలను గౌరవించే కొద్దిమందిలో నే నొకణ్ణి. గుడ్‌బై. టాక్సీ ఆపు" అన్నాను.

పార్క్‌స్ట్రీట్ క్రాసింగ్ జోరుగా సమీపిస్తున్న కారును ఒక్కసారి ఎడమవైపు తిప్పి పెట్రోలు బంకుకు పక్కగా ఆపాడు డ్రైవరు. కారు తలుపుమీద చెయ్యి వేశాను.

"ఆగు" అన్నాడతను నా రెక్క పట్టుకొని. "నే నొక్క ప్రశ్న అడుగుతాను. దానికి జవాబు చెప్పేసి వెళ్ళిపో."

"ఏమిటది?" అన్నాను.

"మేరీలాంటి ఆడదాన్నుంచి నిన్ను రక్షించినందుకు నాకు కృతజ్ఞతయినా చెప్పుకోవా?" అన్నాడు చాలా సీరియస్‌గా. తలుపుమీద నా చెయ్యి అలానే ఉండిపోయింది. నేను మరేమీ మాట్లాడలేకపోయాను.

"డ్రైవర్, కారు పోనీ" అన్నాడు గాస్పెరీ. నే నొక నిట్టూర్పు విడిచి సీటుమీద చేరబడ్డాను.

"స్మోక్?" అన్నాడు సిగరెట్లు కేసు జేబులోనుంచి తీస్తూ. ఇద్దరం సిగరెట్లు ముట్టించాము.

"నువ్వెప్పుడూ ఈ విధంగా ఆలోచించి ఉండవు. అవునా?"

"మేరీ అలాంటి చపలబారు స్త్రీ కాదను కున్నాను."

"నువ్వేమిటి? ప్రేమ అనే పిచ్చిలోపడ్డ ప్రతి మగవాడూ అలాగే అనుకుంటాడు. నేనూ ఒకానొకప్పుడు అలానే అనుకున్నాను. మేరీలాంటి మరో అమ్మాయి నాపిచ్చి కుదిర్చింది. ఆ రోజుల్లో నేను నేపుల్సులో కారు డ్రైవరుగా పనిచేస్తూ ఉండేవాణ్ణి. నా భార్య నాతో ఉన్నట్టే ఉండి ఇద్దరు పసికూనలనూ, నన్నూ వదిలి నే నెవరి దగ్గర డ్రైవరుగా పనిచేస్తున్నానో వాడితో లేచిపోయింది."

"మరి, పిల్లలు?"

"ఆ చలికాలంలోనే ఎంరక్షణలేక చచ్చిపోయారు."

ఈ విలాసపురుషుడు— రోజులు నిమిషాలుగా గడిపేస్తున్న ఈ నడి వయస్సులోని మూర్ఖుడి జీవితం ఇంత నిగూఢమైనదని నే నెప్పుడైనా అనుకున్నానా? గాస్పెరీమీద నా కిదివరకు ఉన్న అభిప్రాయానికి సిగ్గుపడ్డాను. నాలో అతడిమీద కుతూహలం ఎక్కువయింది.

"పేపర్ వంటున్నావు. మరి ఇంత గొప్పవాడి వెలా అయ్యావు?" అనకుండా ఉండలేకపోయాను.

అతడు విచారంగా నవ్వాడు. "సొమ్ము చాలా పాపిష్ఠిది, ఆర్థర్— చాలా పాపిష్ఠిది. నా భార్య వాడితో లేచిపోగానే—డబ్బులో ఉంది కీలకం అంతా అనుకున్నాను. పాతిక సంవత్సరాలు సుఖం అనేది ఈ ప్రపంచంలో ఉన్నదన్న సంగతి జ్ఞప్తి లేకుండా గడిపాను. ఆమె లేచిపోగానే నాలో ఆదివరకు దాగిఉన్న వాంఛలూ, కావేషాలూ తలెత్తాయి. నాకు ఆనందం కావాలి. భోగం కావాలి. నావంటి పుట్టు దరిద్రుడు వాటికి నోచుకోలేదు. కాబట్టి దీనికి ఒక్కటే మార్గం. వాటిని నేను కొనుక్కోవాలి. ధర ఎంతైనా సరే, శ్రమ ఎంతైనా సరే, విధానం ఎటువంటిదైనా సరే."

కొంతసేపటివరకూ అతను మరి మాట్లాడలేదు. చివరకు తాపీగా అన్నాడు: "నేను చాలా పొరపడ్డాను. నా ఎండమావులు నాకు ... లేదు. అవి అలా పొలిమేరల్లోనే ఉ... పోయాయి."

"నాన్సెన్స్! నీ కిప్పుడేం వచ్చింది?" అన్నాను.

కారు ఒక్కసారి ఆగింది. "రేస్ బుక్! రేస్ బుక్!" అని ఓ కుర్రాడు కారు కిటికీలో నుంచి ఓ డజను రేసు పుస్తకాలు ఊపుతూ, నా చెవుల్లో అరిచాడు. నేను ఉలిక్కిపడి మళ్ళీ ఈ లోకంలోకి వచ్చాను.

"సుఖం మాట ఎలా ఉన్నా కష్టాలను తాత్కాలికంగా మరిచిపోవడానికి ఈ ప్రపంచంలో మూడు వ్యసనాలున్నాయి గదా? మన ఇద్దరికీ ఇప్పుడా మూడింటిలో రెండింటి అవసరం ఎంతయినా ఉంది. పద" అన్నాడు నవ్వుతూ



వాల్గంటి

చిత్రం—వై. బాలయ్య (పండ్లాపూర్)

గాస్పెరీ. నేనూ నవ్వుతూ రోడ్డుమీద కాలు పెట్టాను.

"నువ్వు అటూ ఇటూ తిరిగి రేసులు అయిపోయే వేళకి తిరిగిరా" అని డ్రైవరుతో చెప్పి "పద" అన్నాడు నాతో.

ఎటు చూసినా కార్లూ, ట్రాములూ, ధూళీ, మా చుట్టూ మా వంటి కొన్నివేల మంది జనమూ. చాలా గోలగా ఉంది ఆ జాగా అంతా.

మేము వెళ్ళిన గేటుమీద 'సభ్యులు మాత్రమే' అని వ్రాసిఉంది. గేటు దగ్గర దర్వాను టక్కుమని జోళ్ళు అతికించి ఒక సెల్యూట్ కొట్టాడు గాస్పెరీకి. గాస్పెరీ నిర్లక్ష్యంగా తల ఒకసారి ఆడించి, నా రెక్క పుచ్చుకొని లోపలికి తీసుకుపోయాడు.

"ఇదంతా నీకు విసుగు పుట్టడం లేదు కదా?" అన్నాడు ఆర్థర్ ఒక్కసారి నా వైపు

అనుమానంగా చూస్తూ.

"లేదు లేదు. అలా చెప్పుకుని పోతూఉండు. వింటుంటాను" అన్నాను.

అప్పటికి మంచు దట్టంగా కురుస్తూంది. నా ముఖమంతా చేతికి మంచుముక్కలా తగులుతున్నది. ముక్కు దిమ్మకట్టింది. అయినా మొండి ఘటాలం— ఇద్దరం అలాగే కూర్చున్నాము.

ఆర్థర్ మళ్ళీ అందుకున్నాడు:

లోపలికి పోయిన తర్వాత ఇద్దరం ఒక రెస్టారెంట్‌లో కూర్చున్నాము. భోజనాలు ఆర్డరు చేశాడతను.

"నిన్నెందుకు పిలిచానో చెబుతాను, విను. గతవారమే కాన్స్టెంట్ వండర్ అన్న గుర్రాన్ని ఇరవై వేల రూపాయలకు బర్ద్వాన్ మహారాజా దగ్గరనుంచి కొన్నాను. అది ఇవాళ లింకన్ హాండీకాప్‌లో పరుగెడుతోంది. నీకు చూపిద్దామని నిన్నిక్కడికి తీసుకువచ్చాను." మెల్లగా ముందుకు వంగి నా చెవిలో ఊదాడు: "నిన్న రాత్రి మన ట్రెయినర్ ఇవాళ నా గుర్రాన్ని గెలిపిస్తున్నానని నాతో చెప్పాడు. ఇక చూసుకో!"

హఠాత్తుగా ఏదో జ్ఞాపకంవచ్చి బేరర్‌ను పిలిచాడు. "చూడు. గేటు పక్కనే ముదర ఆకుపచ్చరంగు బ్యూక్ సెడాన్ ఒకటి ఉంది. ఆ కారు వెనకసీటులో గోధుమరంగు పార్సెలు ఒకటి ఉంటుంది. తీసుకురా" అన్నాడు.

"అందులో ఏముంది?" అన్నాను. గాస్పెరీ నవ్వాడు. మరో అయిదు నిమిషాలకు బేరర్ ఆ పార్సెలు తీసుకుని వచ్చాడు. బేరర్‌వైపు ఓ రెండు రూపాయల నోటు విసిరి పార్సెలు విప్పాడతను. అందులో ఏముందో తెలుసా? అయిదు వేల రూపాయలు— నోట్లకట్టలు ఉన్నాయి.

"ఏమిటీ!" అన్నాను నేను.

"నీలాగే నేనూ అక్కడ నోరు విప్పేశాను."

"ఇందులో ఆశ్చర్యం ఏముంది? అంత నిర్లక్ష్యంగా వదిలేసిన పార్సెలులో అయిదు వేల రూపాయలుంటాయని డ్రయివరుగాని, బేరర్‌గాని ఎలా ఊహించగలరు?" అన్నాడు పైగా. ఈ పిచ్చివాడితో వాదించి లాభం లేదని అక్కడితో ఊరుకున్నాను.

మేము భోజనంచేసి కాఫీ తాగుతుంటే మొదటి గంట కొట్టారు. ఆ రోజు ఏడు పరుగులున్నాయి. ఇతడి గుర్రం పరుగెత్తేది ఆఖరి పరుగులో. అంతవరకూ అక్కడా ఇక్కడా బాతాఖానీకొట్టి, వాళ్ళనూ వీళ్ళనూ పలకరించి ఏడవ పరుగు మొదలుపెట్టే వేళకు స్టాల్సులోకి వచ్చాము.

గాస్పెరీని చూడగానే అతడి గుర్రం సకిలించింది. దానికి ఇచ్చి రెండు పంచదార బిళ్ళలు తినిపించాడు. దాని వీపుమీద ప్రేమగా రెండు మూడుసార్లు నిమిరాడు. ట్రెయినర్‌తోటీ, జాకీ (గుర్రపు రౌతు)తోటీ రెండు మూడు కబుర్లాడి స్టాండ్సువైపు బయలుదేరాడు.

స్టాండ్సులో చాలా హడావిడిగా ఉంది. మాకు పక్కగా నిలబడి ఇద్దరు బెంగాలీ ముసలివాళ్ళు ఏ గుర్రంమీద కట్టడమా అని వాదించుకుంటున్నారు.

"ఇవాళ 'అమపా' గెలవకపోతే నా మీసం తీసేస్తాను" అంటున్నాడు ఒక ముసలాయన బిగ్గరగా. రెండవవాడు ఫక్కున నవ్వాడు వెటకారంగా.

"దాదా! గుర్రంమీద డబ్బు కట్టడానికి వచ్చావా, గాడిదమీదా?" అన్నాడు మొదటివాడితో.

"ఒరే బిషూ! నీకు అంతా హాస్యంగా ఉంది కదూ? సరే. ఇప్పుడు నా సలహా వినకుండా ఆ సొట్ట గుర్రం గ్లెన్‌మ్యాక్ మీద కడతావో— సర్వ నాశనం అయిపోతావు. ఆపైన నీ ఇష్టం" అన్నాడు మొదటవాడు.



ముల్లు

చిత్రం—పై. బాలయ్య (చంద్రాపూర్)

"గ్లెన్ మ్యాక్!" అన్నాడు రెండవవాడు గట్టిగా, పిడికిలి పైకి ఎత్తుతూ.

"అమపా!" అన్నాడు మొదటివాడు ఇంకా గట్టిగా.

ఇంతలో అందరూ ఒక్కసారి నిలబడ్డారు. అందరి చూపులూ ఒకేవైపు తిరిగాయి. గుర్రాలన్నీ ఒకదాని తర్వాత ఒకటి పరుగు ప్రారంభమయ్యే చోటికి పోతున్నాయి. వాటిమీద రంగు రంగుల చొక్కాలూ, టోపీలూ ధరించిన జాకీలు తమాషాగా కనిపిస్తున్నారు. గుర్రాల వీపులమీద ఉన్న గుడ్డలపైన పెద్ద అంకెలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఒకడు హిందుస్తానీలో "ఆ నాలుగవ నంబరు గుర్రం పేరు ఏమిటి, సార్?" అన్నాడు గాస్పెరీతో.

"అది అమపా. కూచ్ బిహార్ మహారాజాది."

"ఆహా! ఏం గుర్రం! ఏం గుర్రం!" అన్నాడతను బుకీ దగ్గరకు పరుగెడుతూ.

బెంగాలీ ముసలివాళ్ళలో మొదటివాడు మళ్ళీ అందుకున్నాడు: "విన్నావా, విన్నావా? చవటా! నా మాట విను."

రెండవవాడు కొంచెం తగ్గాడు. "అయితే అమపాయే అంటావా?"

"నిస్సందేహంగా! ఇంద. వాది యాభై, నీది యాభై."

"అమపా—త్రీ టు వన్, త్రీ టు వన్" అంటున్నాడు బుకీ (అంటే—ఒక రూపాయకు మూడు రూపాయలు లాభం ఇస్తాడు, ఆ గుర్రం గెలిస్తే.)

నేను గాస్పెరీతో "నీ ఉద్దేశం ఏమిటి?" అన్నాను.

అతడు మెల్లగా "అమపాకి ఆరుఫర్లాంగులు చాలవు. ఈ దూరానికి గ్లెన్‌మ్యాక్ పెట్టింది పేరు. కట్టనీ, మూర్ఖులు ఎంత కడతారో!" అన్నాడు.

"మరి నీ గుర్రం?" అన్నాను.

"ఉష్!" అన్నాడు. "గట్టిగా అరవకు. అవలిస్తే పేగులు లెక్కపెట్టే రకం వీళ్ళు. గ్లెన్ మ్యాక్ జాకీ ఎవరో తెలుసా?"

"ఎడ్వర్డ్" అన్నాను.

"వాడు, మన కాన్స్టెంట్ వండర్ జాకీ జోసెఫ్ ఇద్దరూ తోడు దొంగలు. ఈ రేసు వీళ్ళిద్దరూ కూడించుకుంటున్నారు. గ్లెన్‌మ్యాక్ గెలవవలసిన పందెం ఇది. చాలామంది తమ సొమ్మంతా దానిమీదే కడతారు. గ్లెన్‌మ్యాక్ గెలిచినట్లే వస్తూ ఉంటుంది. ఆఖరి క్షణాల్లో దాని కళ్ళెం ఎడ్వర్డ్ వెనక్కు లాగేస్తాడు. మన కాన్స్టెంట్ వండర్ ముందుకు పోతుంది. అదీ ఏర్పాటు. తమాషా చూస్తూండు" అన్నాడు.

నేను ముక్కుమీద వేలువేసుకున్నాను.

"మరి రేసులంటే ఏమనుకుంటున్నావు, బ్రదర్!" అన్నాడు గాస్పెరీ కన్నుగీటుతూ.

"గ్లెన్‌మ్యాక్ టూ టు వన్, కాంట్‌జన్

సిక్స్ టు వన్, గో కేర్‌ఫుల్ ఎయిట్ టు వన్" అంటున్నాడు బుకీ.

పరుగు ప్రారంభమయ్యే సమయం దగ్గర పడుతున్నది. కోలాహలం ఎక్కువయింది.

"నావైపు చూడకు. ఇందు. ఈ అయిదువేల రూపాయలూ పుచ్చుకో. అలా అటువైపు వెళ్ళి గప్‌చుప్‌గా మన కాన్స్టెంట్ వండర్ మీద కట్టేసి రా" అన్నాడు గాస్పెరీ.

ఎందుకో ఆ నోటు పుచ్చుకుంటుంటే నా చేతులు వణికాయి చెమట పడుతున్నది. మెల్లగా అక్కడినుంచి కదిలాను. గాస్పెరీ ఒక బుకీ వైపు నడిచాడు. అతడిని ఓ పాతికమంది అనుసరించారు. గాస్పెరీ బుకీతో "గ్లెన్‌మ్యాక్ మీద ఒక రెండు వందలు వ్రాసుకో" అన్నాడు నిరక్ష్యంగా.

"అదేమిటి, మిస్టర్ గాస్పెరీ? రెండు వందలేనా?" అన్నారెవరో గుంపులోనుంచి.

"ఏమో! ఒకవేళ నా కాన్స్టెంట్ వండర్ గెలిచేస్తే?" అక్కడివాళ్ళందరూ నవ్వారు. "పోనీ. అయిదు వందలు రాసుకో" అన్నాడు.

అతడి వెనకాల పాతికమందీ "గ్లెన్‌మ్యాక్!" అని అరవడం మొదలుపెట్టారు. నోట్ల కట్టలు బయటకు తీస్తూ.

ఈ కోలాహలంమధ్య నేను మరొక బుకీ దగ్గరకు వెళ్ళి "కాన్స్టెంట్ వండర్ మీద ధర ఎంత?" అన్నాను.

# అతనూ, అతని నీడలూ

బుకీ నావైపేనా తిరక్కుండా "ఫిఫ్టీన్ టు వన్" (ఆ గుర్రం గెలిస్తే రూపాయికి పదిహేను రూపాయల లాభం) అన్నాడు.

"అయితే కాన్స్టెంట్ వండర్ మీద నావో అయిదువేల రూపాయలు" అన్నాను.

అంతా ఒక్కసారి నా వైపు ఆశ్చర్యంగా తిరిగారు.

"కాష్ ఆర్ చెక్?" అన్నాడు బుకీ అనుమానంగా.

"కాష్. ఇదుగో తీసుకో" అని అయిదువేల రూపాయలూ ఇచ్చాను.

నాకో కార్డు ఇచ్చి అతడు వెంటనే బోర్డు మీద పదిహేను చెరిపి అయిదు వేశాడు. గాస్పెరీ మోసం అందరికీ అర్థం అయింది. ఓ డజనుమంది ఈ ధరకు కూడా కాన్స్టెంట్ వండర్ మీద కొంత సొమ్ము కట్టారు.

పరుగు ప్రారంభమైనట్టు ఎలక్ట్రిక్ బెల్ సూచన ఇచ్చింది. అందరం స్టాండ్సువైపు పరుగెత్తాము. మేము నిల్చున్న చోట ఒక లౌడ్‌స్పీకర్ ఉంది. కామెంటేటరు చెప్పుకుపోతున్నాడు:

"ప్రారంభం చాలా బాగుంది. అన్ని గుర్రాలూ ఒకేసారి బయలుదేరాయి. గో కేర్‌ఫుల్ ముందుకు పోయింది. దాని వెనకాలే రాంట్‌జన్ వస్తోంది. రాంట్‌జన్ వెనక కొద్ది దూరంలో గ్లెన్‌మ్యాక్ ఉంది. దాని వెనకాల అమహ్, వెల్‌ఫేర్ లేడీ, బర్గ్‌లీ ఉన్నాయి. చివర కాన్స్టెంట్ వండర్ ఉంది. ఇప్పటికీ వరస అలాగే ఉంది. ఇప్పటికీ వరస అలాగేఉంది. ఇప్పుడు రాంట్‌జన్ ముందుకు వచ్చి, గో కేర్‌ఫుల్‌ని వెనక్కి నెట్టింది. అమహ్ పూర్తిగా వెనక్కి తగ్గిపోయి ఆ జాగాకి వెల్‌ఫేర్ లేడీ వచ్చింది. మిగతా గుర్రాలన్నీ అలాగేఉన్నాయి. రాంట్ జన్ టు గో కేర్‌ఫుల్, రాంట్‌జన్ టు గో కేర్‌ఫుల్. వెల్ ఫేర్ లేడీ ముందుకి వస్తోంది. వచ్చేసింది. రాంట్‌జన్ టు వెల్‌ఫేర్ లేడీ, రాంట్‌జన్ టు వెల్‌ఫేర్‌లేడీ. గుర్రాలన్నీ వంపు తిరుగుతున్నాయి, వంపుతిరుగుతున్నాయి. వెల్‌ఫేర్ లేడీ రాంట్‌జన్‌ని కూడా దాటి ముందుకు పోయింది. గ్లెన్‌మ్యాక్ పరుగు ప్రారంభించింది. గో కేర్‌ఫుల్‌ని దాటింది. రాంట్‌జన్‌ని దాటింది. వెల్‌ఫేర్ లేడీ టు గ్లెన్‌మ్యాక్, వెల్‌ఫేర్‌లేడీ టు గ్లెన్‌మ్యాక్. గ్లెన్‌మ్యాక్‌వెల్‌ఫేర్ లేడీదగ్గరకొచ్చేసింది." కామెంటేటర్ గొంతు హెచ్చింది. చాలా జోరుగా చెబుతున్నాడు.

"గ్లెన్‌మ్యాక్! గ్లెన్‌మ్యాక్!" అని హోరుమని అరుస్తున్నారు గొంతు చించుకుంటూ మా చుట్టూ ఉన్న జనమంతా.

"వెల్‌ఫేర్ లేడీని దాటేసింది. ఇప్పుడు గ్లెన్‌మ్యాక్ ముందరుంది. గ్లెన్‌మ్యాక్ టు వెల్‌ఫేర్ లేడీ, గ్లెన్‌మ్యాక్ టు వెల్‌ఫేర్ లేడీ."

జనమంతా సంతోషంగా బిగ్గరగా "గ్లెన్‌మ్యాక్! గ్లెన్‌మ్యాక్!" అని అరుస్తున్నారు.

ఇంకా ఒక్క ఫర్లాంగే ఉంది గెలుపుగీత. అంతే. నేను చూస్తూనే ఉన్నాను. ఇంతవరకూ వెనకాల తాపీగా వస్తున్న మా కాన్స్టెంట్‌వండర్ బాణంలాగా దూసుకుంటూ నలుగురూ ఏమయిందో తెలుసుకునే లోపల అన్ని గుర్రాలనూ దాటుకుంటూ ముందుకు వెళ్ళిపోయింది. దాని వెనకాలే అమహ్ వచ్చేసింది. ఈ రెండుగుర్రాలూ ఒకదాన్నొకటి అంటుకున్నట్లు ముందుకు పరుగు తీస్తున్నాయి. జాకీలు కొరడాలు తీసి గుర్రాలను కొడుతున్నారు.

"కాన్స్టెంట్ వండర్!" అని అరుస్తున్నాము నేనూ, గాస్పెరీ.

"అమహ్!" అని అరుస్తున్నారు బెంగాలీ ముసలివాళ్ళు ఇద్దరూ. గెలుపుగీత దగ్గరకు వచ్చేసింది. ఇంకా కొన్ని గజాలే మిగులుఉంది. అరె! ఇదేమిటి? ఈ మూడవ గుర్రం ఎక్కడి నుంచి వచ్చింది? అంతే. ఒక్క క్షణంలో తారాజువ్వల్లాగు మూడు గుర్రాలూ మమ్మల్ని దాటుకుంటూ వెళ్ళిపోయాయి. వీటికి పది అడుగుల వెనకాల పాపం జనమంతా కట్టిన గ్లెన్‌మ్యాక్ రొజుకుంటూ వస్తున్నది.

పౌర్ణమినాటి సముద్రపు హోరులా ఉంది కోలాహలం. కామెంటేటరు గొంతుక అందులో




స్టాకిస్టులు:

1. మెస్సర్స్: పువ్వాడ షలయ్య & సన్స్., మెయిన్‌రోడ్డు, విజయవాడ.
2. మెస్సర్స్: కృష్ణా ఎంపోరియం, మెయిన్‌రోడ్డు, కాకినాడ.
3. మెస్సర్స్: వైజాగ్ ఎంపోరియం మెయిన్‌రోడ్డు, విశాఖపట్నం.
4. మెస్సర్స్. కృష్ణా మెడికల్ అండ్ జనరల్‌స్టోర్స్, పాలచెట్టురోడ్డు, శ్రీకాకుళం.

పూర్తిగా మునిగిపోయింది.

"ఏది గెలిచింది?" అన్నాను గాస్పెరీ చెవిలో గట్టిగా, ఆత్రుతగా.

"ఏమో!" అన్నాడు భుజాలు ఎగరవేసి. అతడి ముఖం నల్లగా అయిపోయింది.

"ఈ మూడవ గుర్రం ఏమిటి? ఎక్కడి నుంచి వచ్చింది? ఎలా వచ్చింది?" అన్నాను. నాకు అంతా ఓ మహా మాయలా ఉంది.

"అది బర్గ్‌లీ. ఎవ్వరూ కట్టకుండా వదిలేశారే, ఆ సొట్టగుర్రం అది" అన్నాడు కసిగా, విచారంగా.

మాకు ఎదురుగా ఉన్న బోర్డుమీద మూడు 'పి' అనే ఇంగ్లీషు అక్షరాలు లేచాయి. "ఫోటో ఫినిష్! ఫోటో ఫినిష్!" అన్నారందరూ. అంటే ఫోటోలు చూస్తేనేగాని, ఏ గుర్రం గెలిచిందో చెప్పడం కష్టం అన్నమాట. ఒక్కసారిగా మాలోని సత్తువ అంతా ఇంకిపోయి రెస్టారెంటులోకి పోయికూలబడ్డాము. రెండు బ్రాందీ చుక్కలు లోనికి పోనిచ్చాము. అటూ ఇటూ కాలుకాలిన పిల్లుల్లాగా తిరిగాము. సిగరెట్టుమీద సిగరెట్టు ముట్టిస్తూ, సగం కాలిన సిగరెట్లను విసుగ్గా నేలన విసిరికొడుతున్నాము. మళ్లీ రెస్టారెంటులోకి వచ్చి మరి రెండు బ్రాందీ చుక్కలు పుచ్చుకుంటుంటే ఒక్కసారి గొల్లుమన్నారంతా. ఇద్దరం బయటకు పరుగెత్తాము. ఓడిపోయిన సైన్యం కోటగోడమీద తెల్లజండా ఎత్తినట్టు తాపీగా నంబర్లు బోర్డుమీదికి లేచాయి. 7, 6, 4. అంటే బర్గ్‌లీ ఫస్టు, కాన్స్టెంట్‌వండర్ సెకండు, అమెపా థర్డు అన్నమాట.

అందరూ ఇళ్లకు పోతున్నారు. ఎవరిముఖానా నెత్తురు చుక్క లేదు. అక్కడక్కడమాత్రం ఎవడో అదృష్టవంతుడు గట్టిగా గోలచేస్తూ, గెలిచిన సొమ్ము అందుకోవడానికి ఉత్సాహంగా పరుగులు పెడుతున్నాడు.

"ఇక ఈ దుమ్ములోనూ, దొమ్మిలోనూ మనం ఎందుకు? పోదాం పద" అన్నాడు గాస్పెరీ నాతో.

'మరి రేసులంటే ఏమనుకున్నావు, బ్రదర్?' అన్న గాస్పెరీ మాటలు నాకు జ్ఞాపకం వచ్చాయి. ఇద్దరం పోయి కారులో కూలబడ్డాము. దోవలో "మూడు వ్యసనాల్లోనూ ఒక సరదాతీరిపోయింది. ఇక రెండవది కానిద్దామా?" అన్నాడు. నేనూ వద్దనే స్థితిలో లేను. ఆ రాత్రి ఇద్దరం తప్పతాగి ఒక హోటలు గదిలో నేలమీద దొర్లి నిద్రపోయాము. ఆ మర్నాడూ, ఆ తర్వాత రోజూ—అలా అలా కథ సాగింది" అని చప్పున లేచి నిల్చున్నాడు ఆర్థర్.

"అదేమిటి? కథ పూర్తిచెయ్యకుండా, అలా లేచావు?" అన్నాను నేను ఆత్రుతగా.

"పూర్తిచెయ్యడానికేముంది? మరో రెండు నెలల తర్వాత నన్ను ఉద్యోగంలోనుంచి తీసేశారు. గాస్పెరీ సాయం చేస్తానన్నాడు గాని, నేను ఒప్పుకొనేటంత అవస్థకు ఇంకా దిగజారలేదు. పైగా అతడితో ఉన్నన్నాళ్లూ అతడి విచారం, అతడి ఒంటరితనం, అతడి నైరాశ్యం నన్నూ పట్టుకున్నాయి. అతడినుంచి ఎలాగైనా తప్పించుకుంటేనేకాని లాభం లేదని, ఇక్కడ ఒక స్నేహితుడి కాళ్లు పట్టుకొని ఈ ఉద్యోగం సంపాదించి ఇలా వచ్చేశాను."

ఆర్థర్ గట్టిగా ఆవులించి, చిటికెలువేస్తూ, "ఇక పోదాంపద. చలివేస్తోంది" అన్నాడు. నేను విధిలేక లేచాను.

"మరి గాస్పెరీ ఏమయ్యాడు?" అన్నాను.

"ఉన్నాడు. ఇంకా కలకత్తాలోనే ఉన్నాడు" అని, నవ్వుతూ "రేపు ఆదివారం కదూ? మనం కలకత్తా వెళ్లినప్పుడు నిన్నతడికి పరిచయం చేస్తాను. ఈ కథాశేషం తర్వాత నీకు చెబుతాను. అంతవరకూ నన్ను మరేమీ అడగకు" అన్నాడు.

హుగ్లీలో ఒక పెద్ద స్టీమరు సముద్రం వైపు పోతున్నది. మా బెంగాయిల్ మార్కెట్‌లో ఎనిమిది గంటలు కొట్టారు. నేపాలీ దర్వాన్ల ఇళ్లలో ఎవరో చేపలు కాలుస్తున్నారు. ఇద్దరం తాపీగా నడుచుకుంటూ మా బంగళాలదాకా వచ్చాము.

భోజనంచేసి వాలుకుర్చీలో కూర్చుని ఏదో పత్రిక తిరగవేస్తున్నాను. కాని దృష్టి అటు పోవడం లేదు. మనస్సంతా భారంగా, దిగులుగా ఉంది. పుట్టింట్లో ఉన్న నా భార్యమీద ఎక్కడలేని అభిమానం పుట్టుకువచ్చి చప్పున లేచి ఆమెకో రెండు తావుల ప్రేమలేఖ ఒకటి వ్రాసేశాను.

ఆ లేఖ కవరులో పెడుతుంటే "సాబ్ పిలుస్తున్నారు" అన్నాడు పొరుగింటి నౌకరు.

నేను ఆర్థర్ ఇంటికి వెళ్లాను. కిటికీలోనుంచి ఆకాశం వైపు అదే పనిగా చూస్తున్నాడు అతను.

"మొత్తం ఎన్ని నక్షత్రాలున్నాయి?" అన్నాను నవ్వుతూ.

"అదికాదు. ఇలా రా" అన్నాడు.

నేనూ కిటికీ దగ్గరికి వెళ్లి అతడి పక్కన నిల్చుని నింగివైపుచూశాను. చవితినాటిచంద్రుడు, అతడికి ఎంతో సమీపంలో ఒక పెద్ద నక్షత్రం.

"చూడు. ఆ నక్షత్రానికి శీవికీ, అందానికీ ఏమిటి లోటు? ఎలా ప్రేమతో, ఆశతో ఆ చందమామవంక చూస్తోందో చూడు. ఆకాశంలోని చుక్కలన్నీ అతడి చుట్టూ అలా కాచుకొని ఉంటాయి. కాని ఆ మూర్ఖుడు వాటివైపు కన్నెత్తి చూడడు. రాత్రంతా, ఆకాశవీధిలో కనుపించని ఏ ఊహాసుందరికోసమో వెతుకుతూ తిరుగుతూ ఉంటాడు. మానవుడు తనకన్నా వయస్సులో ఎన్నో యుగాలు పెద్దదైన ఈ ప్రకృతిని అనుకరించడం సహజమేకదా?" అన్నాడు ఆర్థర్.

"మంచి వర్జీనియా చుట్టలు ఉన్నాయి. కాలుస్తావా?" అన్నాడు హఠాత్తుగా ప్రసంగం మార్చి.

ఇద్దరమూ చుట్టలు కాలుస్తూ, బాతాఖానీ వేసుకుని, ఏ మూడవ జామునో నిద్రపోయాము.

మర్నాడు లేచేసరికి బాగా పొద్దెక్కింది. దిన



ఒంటరితనం

చిత్రం—కె ఎస్ బాలసుబ్రహ్మణ్యం (మద్రాసు-7)

పత్రిక చదివి ముఖం కడుక్కుని తుడుచుకుంటుంటే అతడు వచ్చాడు.

"వేగం బట్టలేసుకో. లోకల్ బండికి ఇంకా అరగంటే టైముంది" అన్నాడు.

మేము స్టేషన్‌లో టిక్కెట్లు కొంటూ ఉంటే రైలు వచ్చింది. ఇటువంటి రైలుబళ్లు ఖరగ్‌పూర్, కలకత్తాల మధ్య ప్రతిదినం సుమారు ఒక డజను తిరుగుతూ ఉంటాయి. మేము ఎక్కే లోకల్‌లో ఒక్కటే పొడుగాటి సెకండ్‌క్లాసు పెట్టె ఉంటుంది. మేము ఎక్కగానే పెట్టెలో ఒక మూల చీట్లపేక ఆడుతున్న గుంపు కనుపిస్తుంది. హౌరా చేరేదాకా వాళ్లకు మరో లోకం ఉండదు. టు నో ట్రంప్స్, ఫోర్ స్పేడ్స్, డబుల్, పాస్ అని కేకలు వినిపిస్తూ ఉంటాయి, ఆ మూలనుంచి. మధ్యమధ్య చిన్న చిన్న కొట్లాటలు. పక్కస్టేషన్ ఉలుబేరియాలో ఇద్దరు మధ్య వయస్కులు ఎక్కుతారు. ప్లాట్‌ఫారంమీద కుర్రాళ్లు కొందరు "చేనాచూర్ దాదా! ఏకానా కోరి పాకెట్" (చెనాచూర్—అణాకొక పాకెట్) అనీ, "పాన్‌దబూపాన్" (కిళ్లీలు) అనీ, "డాబ్! డాబ్!" (కొబ్బరి బొండాం నీరు) అనీ అరుస్తుంటారు. అందులో కొందరు పెట్టెల లోపలికి కూడా ఎక్కుతుంటారు. వీళ్లిద్దరిలో ఒకాయన కిళ్లీల కుర్రాణ్ణి పిలుస్తాడు. "అరె భోకా! ఏక్ సాదా పాన్ డాబ్‌తో" అంటాడు. వాడు బుట్టలోనుంచి ఒక ఆకు తీస్తాడు. ఆ ఆకు రెండు ముక్కలుచేసి ఒకదానిలో ఒకటి ఉంచుతాడు. కుంచెతో సున్నం పట్టిస్తాడు. గుంటు చెక్కలగుండ, కాచువేసి ఇతడికి అందిస్తాడు. ఇతడా కిళ్లీని లోపలికి తోసి చెయ్యి జాస్తాడు. కుర్రవాడు చేతిలో సున్నంతో

## కుట్టుపని నేర్వండి



గురువు లేకుండా అన్నిరకములను స్వయంగా కత్తిరించి కుట్టుటకు 266 పే. 180 బొ. ల పుస్తకము రు. 5/— బట్ట ఏమీ వృధా పోకుండా కత్తిరించుటకు డ్రాయింగ్ బొమ్మలతో 50 ప్లాన్సు పుస్తకం రు. 3—50. 2 తెలుగు. 2 అందమైన ఫుల్ క్యాలికో బైండ్లు. వి. పి. అదనము.
**జి. పున్నారావుచౌదరి, మోపర్రు, తెనాలి తా.**






పోస్టు ద్వారా చిత్రకళ నేర్చుకోండి.

సులభమైనా సమర్థమైన విధంగా దక్షిణ భారతలోని ప్రముఖ చిత్రకారుడు శంతనుచే శిక్షణ. బోధనాభాష ఇంగ్లీషు లేక తమిళం. కోర్సు రెండు సంవత్సరాలు మాత్రమే.

భారతదేశంలో కాని, విదేశాలలో కాని ఎక్కడ ఉన్నా స్త్రీ పురుషులు ఉభయులూ చేరి, నియమిత సమయాలలో పాఠాలు తెప్పించుకొనవచ్చు. ప్రాస్పెక్టస్‌కొరకు 25 న. పై. ల స్టాంపులతో దరఖాస్తు పెట్టండి.

**SANTHANU'S ART INSTITUTE,**
c/o Chitira Kullan,
P.B. No. 2740,
CHINTADRIPET, MADRAS-2.
స్థాపితం: 1957. ఫోన్: 82796.


# అతనూ, అతని నీడలూ

ముంచిన కర్రపుల్ల ఒకటి పెడతాడు. అక్కడి నుంచి తర్వాత స్టేషన్‌దాకా ఆ సున్నం నాకుతూ, కిళ్లీ నములుతూ ఉంటాడు అతడు. బావురియా స్టేషన్‌లో ఒక క్రిస్టియన్ మతాధికారీ, అతనివెంట నలుగురు కుర్రవాళ్లూ ఎక్కుతారు. సంత్రగఛీలో ఒక బూరిబుగ్గల అమ్మాయి, ఆమె వెనకాల ఒక అబ్బాయి ఎక్కుతారు. ఇద్దరికీ కళ్లజోళ్లు. ఒకరి ఎదురుగా ఒకరు కూర్చుంటారు. హౌరాచేరేదాకా మాట్లాడుకోరు. హౌరాలో మళ్లీ ఇద్దరూ కలిసి ఒకరి వెనకాల ఒకరు దిగుతారు. అప్పుడప్పుడు జోళ్ల పాలిష్ కుర్రాడు ఒకడు లోపలికి వచ్చి అందరికాళ్లూ పట్టుకొని లాగుతుంటాడు, జోళ్లు పాలిష్ చేస్తావని. ఒకోసారి చిడతల గాయకుడు ఒకడూ, వాడి వెనకాల డోలు వాద్యగాడూ ఎక్కుతారు. వాళ్లను చూస్తే నాకు హడల్! గాయకుడు ముందు ఒక నిమిషం చిడతలు కొడతాడు. తర్వాత చెయ్యి చెవిమీద ఉంచి ఒక హిందీ సినిమా పాట అందుకుంటాడు. ఆర్థర్ వాడితో—పాడకుండా ఉంటే ఒక అణా డబ్బులిస్తానని అప్పుడప్పుడు సంప్రతింపులు జరుపుతూఉంటాడు. మాతోనే చెంగాయిల్‌లో ఒకాయన ఎక్కి ఒకచోట పీపు ఆన్చి గుర్రుపెట్టడం మొదలు పెడతాడు. దోవలో బ్రహ్మాండాలు బద్దలైనా లేవడు. హౌరా ప్లాట్‌ఫారం మీదికి బండి చేరగానే ఎవరో లేపినట్టు ఠక్కున గుర్రు ఆపేసి లేస్తాడు. బండి ఆగేలోగా అందరినీ తోసుకుంటూ ముందుగానే దిగిపోయి గబగబా వెళ్లిపోతాడు.

నేను, ఆర్థర్ ప్లాట్‌ఫారం దాటగానే కాఫీ తాగుతాము. తర్వాత ఒక టాక్సీని కేకవేసి, ఎస్ప్లనేడ్ దాకా కలిసి వెళ్తాము. అక్కడ నేను దిగిపోతాను. అతడు తిన్నగా టాక్సీలో పార్కువీధికి పోతాడు.

టాక్సీ దిగుతూ "మళ్లీ ఎప్పుడు కలుద్దాము?" అన్నాను.

"సరిగ్గా రాత్రి ఎనిమిది గంటలకు మెట్రో దగ్గర నిల్చో. నేనొస్తాను" అన్నాడు.

చౌరంఘీలోని ఇన్సూరెన్సు బిల్డింగు పెద్ద గడియారం సరిగ్గా ఎనిమిది గంటలు చూపిస్తున్నది. నేను, ఆర్థర్ ఫుట్‌పాత్ మీద నడుస్తున్నాము. ఆ కిందటి రోజే జీతాలు పుచ్చుకోవడం మూలాన ఇద్దరి జేబులూ బరువుగానే ఉన్నాయి.

"ఎక్కడికి?" అన్నాను.

"రికార్డో గాస్పెరీని చూస్తానన్నావుగా? పరిచయం చేస్తాను. పద" అన్నాడు.

మెయిన్ రోడ్డు తప్పించి కొన్నివీధులు అటూ ఇటూ తిరిగి చివరికి ఒక హోటలు దగ్గరికి వచ్చాము. "పద" అన్నాడు ఆర్థర్. లోపలికి ప్రవేశించాము.

ఒక పెద్ద హాలు. లైట్లన్నీ గోడలలోనుంచి మందంగా కాంతినిస్తున్నాయి. హాలంతా కిక్కిరిసి ఉంది. నిషాకొలిపే పానీయాల వాసన, సిగరెట్ల పొగ గదంతా ఆక్రమించుకున్నాయి. హాలుకు ఒక మూల ఒక అమ్మాయి నిల్చుని ఇంగ్లీషు పాట ఒకటి ఒళ్లు తిప్పుకుంటూ పాడుతున్నది. ఆమె వెనకాల పియానో, వయోలా, డ్రమ్ము ముగ్గురు వాయిస్తున్నారు. ఆమె గొంతుహాయిగా, శ్రావ్యంగా ఉంది. వాలుగువైపుల గ్లాసుల చప్పుళ్లూ, మెల్లగా మాట్లాడుకుంటున్న గొంతులూ వినిపిస్తున్నాయి. మేము ఇద్దరం పోయి ఒక ఖాళీ టేబిల్ దగ్గర కూర్చున్నాము. భోజనం ఆర్డరు చేశాము. ఆమె పాట ఆపేసింది. కూర్చున్న వాళ్లందరూ చప్పట్లు కొట్టారు. ఆమె మరో పాట ప్రారంభించింది.

"గాస్పెరీ ఏడి?" అన్నాను.

"పది గంటలకి వస్తానన్నాడు" అన్నాడు ఆర్థర్.

"అయితే ఈ మధ్య రెండు గంటలూ ఏం చేద్దాము?" అన్నాను.

"నీ చుట్టూ ఇందరు అందమైన అమ్మాయిలున్నారు . ఇన్ని పానీయాలున్నాయి. హాయిగా సంగీతం ఉంది. బ్రహ్మాండమైన భోజనం వస్తుంది. రెండు గంటలు గడపలేవా?" అన్నాడతను నవ్వుతూ. నాకు ముచ్చెమటలు పోశాయి. జేబులోనుంచి రుమాలు తీసి ముఖం తుడుచుకుంటూ పక్కకు తిరిగాను. నాకు దగ్గరలోనే మరో టేబిలు దగ్గర ఒంటరిగా కూర్చున్న ఒక అమ్మాయి చిన్నసవ్వు నవ్వి సున్నితంగా కన్నుగీటింది.

గడియారం పదకొండు కొట్టినట్టుజ్ఞాపకం. గంటలు కొడుతుంటే లెక్కపెట్టడానికి ప్రయత్నం చేసి లాభం లేక ఆపేశాను. హాలులో నాలాగా నిండుగా తాగి లేవలేని స్థితిలో ఉన్న ఏ కొద్దిమందో మిగిలి ఉన్నారు.

"నీ పేరేమిటన్నావు?" అన్నాను నా పక్కన కూర్చున్న అమ్మాయి ముఖంలోకి చూస్తూ. నాకు రెండు ముఖాలు కనిపిస్తున్నాయి. "ఎన్నిసార్లడుగుతావు?" అందామె విసుగ్గా. చేతిలోని గ్లాసులోకి సీసా వంచబోతూంటే ఆర్థర్‌ఆపాడు.

"చాలు. ఇప్పటికే తప్ప తాగావు. బుద్ధి గడ్డితిని నిన్నిక్కడికి తీసుకొచ్చాను. ఇక పోదాం పద" అన్నాడు.

"మరొక్క చిట్కా లోపలికి పోనిద్దాం, భాయ్! పట్టు" అన్నాను.

"చిట్కా లేదు, గిట్కా లేదు. ఇక వాంతి చేసుకుంటావు. పద" అన్నాడు.

"గాస్పెరీ ఏడి?" అన్నాను.

"ఇవాళ కాదు. మరొకనాడు" అన్నాడు.

చప్పున లేచి అతడి చొక్కా కాలరు రెండు చేతులతోనూ పట్టుకున్నాను. "రాస్కెల్! నన్ను మోసం చేస్తావా? చెప్పు, గాస్పెరీ ఎక్కడ

(తరువాయి 67 వ పేజీలో)

# అతనూ, అతని నీడలూ

(12 వ పేజీ తరువాయి)

ఉన్నాడో! చెప్పకపోతే విన్నప్పుడు నిలువునా ఖూనీ చేస్తాను. వాణ్ణీ, నిన్నూ కలిపి ఖూనీ చేస్తాను. వినుకుంటున్నావా!" అని గట్టిగా అరిచాను.

"ఇప్పుడు గాస్పెరీ ఘనకెందుకు? ఇంటికి పద. వాడి సంగతి నీకు దోవలో చెబుతాను" అన్నాడతను పట్టువిడిపించుకోవడానికి ప్రయత్నం చేస్తూ.

పనికిరాదు. ఇప్పుడేచెప్పు.వాడెక్కడున్నాడు? ఏం చేస్తున్నాడు? పది గంటలకి వస్తానన్నాడు. ఎందుకు రాలేదు?"

ఆర్థర్ నా రెండు చేతులూ ఒక్క గుంజాతో విడిపించాడు. ఆ ఊపుతో నేను వెళ్ళి ఓ మూల పడ్డాను. తూలుతూ లేచాను. ముందుకు వెళ్ళ బోయాను. నడవడానికి ఓపిక లేదు. కాళ్ళు వీర సంగా తేలుతున్నాయి. మోకాళ్ళలో పటుత్వం లేదు. తల గిర్రున తిరుగుతున్నది. దగ్గరలో ఒక కుర్చీ ఉంటే అందులో కూలబడ్డాను. గాస్పెరీ వస్తే బాగుండును. ఇంత ఆలస్యం ఎందుకు చేస్తున్నాడు? అసలు గాస్పెరీ ఎవరు? ఇదేం జాగా? నే నిక్కడ ఏం చేస్తున్నాను? ఇక్కడి నుంచి వెళ్ళిపోవాలి. ఎక్కడికి? ఎలా? ఏమిటో! ఏ...మి...టో! ఏ......మి......టో !

తిగ్గున తెలివి వచ్చింది. నేనో గదిలో మంచం మీద పడుకుని ఉన్నాను. మంచానికి కొంచెం దూరంలో ఒక డ్రస్సింగ్ టేబిలుంది. టేబిలుకు పక్కగా ఒక స్టాండు ఉంది. ఆ స్టాండుకు నా కోటు, నెక్‌టై ఎవరో తగిలించి ఉంచారు. గదిలో ఒక మూల రేడియేటర్ వేడిగా కాలుతున్నది. ఒక నిమిషందాకా నా విభ్రమత్తులో ఉన్న కళ్ళకు ఇవన్నీ మసక మసకగా కనుపించాయి. 'ఇంతకూ నా కిలా అకస్మాత్తుగా తెలివి ఎందుకు వచ్చింది?' అనుకుంటూనే నా ఒళ్ళు ఒక్కసారి బిగుసుకుపోయింది. నా కోటు జేబులు ఎవరో తడుముతున్నారు. ఒక జేబులోనుంచి నా పర్సు, జేబురుమాలు, కలం బయటకు తీశాడా వ్యక్తి. అందులో మరింకేమీ లేవు. కలం, జేబురుమాలు మళ్ళీ కోటుజేబులో ఉంచేసి, పర్సు టేబిలు దగ్గరకి తీసుకువెళ్ళి దానిమీద ఖాళీచేశాడు. నా జీతం సొమ్మంతా టేబిలుమీద పరుచుకొంది. టేబిలుమీద మాంసం ముక్కలు తరిగే గొడ్డు కత్తి ఒకటి టేబిల్‌లైట్ కాంతిలో వికంగా కనిపిస్తున్నది. నా గొంతులో తడి ఆరిపోయింది. ఆ క్షణంలో నా ఆప్తులందరినీ తలుచుకొని వాళ్ళకు తుది నమస్కారం అందజేశాను. కళ్ళప్పగించి అలా చూస్తూ పడిఉన్నాను. ఊపిరికూడా గట్టిగా తియ్యడం మానేశాను. సొమ్ము పోతే పోయింది. వీడు నన్ను ప్రాణాలతో వదిలిపెడితే చాలు! నా భార్యను తలుచుకొని 'నిన్ను పెళ్ళాడినందుకు నన్ను క్షమించు' అన్నాను మనసులోనే.

నిల్చున్నవాడు ఏదో గొణుక్కుంటున్నాడు. పర్సులోని సొమ్మంతా మళ్ళీ అందులో పెట్టేశాడు. ఆ గొడ్డుకత్తి పట్టుకొని నా వైపు తిరిగాడు. నే నలాగే ఆ గుడ్డి వెలుతురులో అతణ్ణే చూస్తున్నాను. నేను మేలుకున్నట్టు అతడికింకా తెలియదు. నా వైపు రెండడుగులు వేశాడు. ఒక నిమిషం అలాగే నిల్చుని మళ్ళీ గొణుక్కుంటూ వెనక్కు తిరిగి గదిలోనుంచి బయటకు వెళ్ళిపోయాడు. అతడు వెళ్ళిన రెండు మూడు నిమిషాల తర్వాత నా మెదడు మళ్ళీ పని చెయ్యడం ప్రారంభించింది. ఇతడిని ఎక్కడో చూసినట్టు జ్ఞాపకం. సుమారు ఆరడుగుల ఎత్తు, మాసిన గడ్డం, దట్టమైన కనుబొమలు, జొన్నపొత్తు పీచులాటి జుత్తు, ఆకుపచ్చని కళ్ళు—గాస్పెరీ! అవును. రికార్డ్ గాస్పెరీయే అయిఉంటాడు. ఆరర్ చెప్పిన వర్ణన నాకింకా జ్ఞాపకం ఉంది. మరయితే ఇలా ఉన్నాడేమిటి? గాస్పెరీ లక్షలకు అధికారి. ఈ వ్యక్తికి చిరిగిన చొక్కా, అక్కడక్కడ అతుకులు ఉన్నపంట్లాము, మాసిన గడ్డం! బహుశా ఇదంతా ఇంకా తాగుడు తాలూకు ప్రభావం అనుకున్నాను. చప్పున లేచి బాత్‌రూమ్‌లోకి వెళ్ళి తల కొళాయికింద పెట్టి చన్నీళ్ళతో కడిగాను. తువ్వాలుతో ముఖం బాగా రుద్దాను. అయినా ఇందాక నా గదిలోనుంచి వెళ్ళిన వ్యక్తి రూపం మాత్రం నా మనస్సులో అలాగే ఉంది. మరి నా ఊహ నిజమైతే గాస్పెరీ నా గదిలో ఏం చేస్తున్నాడు? నన్ను చంపడానికి ఎందుకు ఆలోచిస్తున్నాడు?

గదిలోనుంచి బయటికి వచ్చాను. అదొక పెద్ద వరండా. రెండు వైపులా గదులున్నాయి. వాటినన్నిటినీ దాటుకుంటూ నడిచాను. చివరన మేడమెట్లున్నాయి. మెట్లుదిగాను. కింద—ఆఫీసు గది అయిఉంటుంది-ఒక టేబిలు, చుట్టూ నాలుగు కుర్చీలు, గోడ దగ్గర రెండు అల్మైరాలు ఉన్నాయి. గదికి రెండు వైపులా రెండు ద్వారాలున్నాయి. ఒక ద్వారం తెర తొలగించి తొంగి చూశాను. మేము రాత్రి కూర్చున్న హాలు! పియానో, వయోలా, డ్రమ్ము మూల కునికిపాట్లు పడుతున్నాయి. హాలులో ఉన్న కుర్చీలూ, టేబిలులూ గాఢ నిద్రలో ఉన్నాయి. రెండవ ద్వారంలోనుంచి లోపలికి వెళ్ళాను. మొదటి గది కొట్టుగది అయిఉంటుంది. దాని తర్వాత గది వంటగది అని ఖచ్చితంగా తెలుస్తున్నది. ఒక మూల గాడిపొయ్యి, దానిమీద పెద్ద కళాయి, కళాయిలో నూనె, మరోవైపు తరిగిన కూర ముక్కలు, ఒక కోళ్ళబుట్ట. ఆ గదికూడా దాటి బయటికి నడిచాను. అదొక ఖాళీ స్థలం. చుట్టూ ప్రహరీగోడ ఉంది. నాకు కొద్ది దూరంలో ఒక కాలు విరిగిన టేబిలుంది. టేబిలు ముందు ఉన్న ఒక పాత కుర్చీలో నా వైపు వీపు తిప్పి కూర్చున్నాడతను. తల టేబిలుమీద ఆనించాడు. గొడ్డుకత్తి చేతి పక్కన టేబిలుమీద ఉంది.

అడుగులో అడుగు వేసుకుంటూ దగ్గరగా వెళ్ళి ఆ గొడ్డుకత్తి తీసేశాను. మెల్లగా అతని చెవిలో "మిస్టర్ గాస్పెరీ!" అని పిలిచాను.

విద్యుద్ఘాతం తగిలినవాడులా లేచాడు. చెయ్యి కత్తి పెట్టిన వైపు పోయింది. కాని కత్తి అక్కడ లేదు. ఎందుకైనా మంచిదని నేను కొద్ది వెనక్కు నడిచి నిల్చున్నాను. తాపీగా నా వైపు తిరిగాడు.


"ఎవరు నువ్వు?" అన్నాడు.

"నేను ఆరర్ హేఫ్రెన్ స్నేహితుణ్ణి. హిందూని" అన్నాను.

"ఆరర్ హేఫ్రెన్?" జ్ఞాపకం తెచ్చుకుంటున్నాడు.

"ఓ!" అన్నాడు ఆఖరికి. "అయితే నాతో నీకేం పని?"

నేను జవాబియ్యలేదు. నిజమే. అతడితో




చిత్రం — కలువకొలను సదానంద (పాకాల)

నాకేం పని? అతని కళ్లలో మళ్లీ అనుమానం తొణికిసలాడింది.

"నువ్వు రోస్సిలినీ, ఫెర్నాండో, ఫెర్మీ— వీళ్ళ నెరగవూ?" అన్నాడు సూటిగా చూస్తూ.

"ఊహుఁ! వాళ్లెవరో నాకు తెలీదు. నువ్వు నన్ను చంపడానికి ఎందుకొచ్చావో అడుగుదామని వచ్చాను" అన్నాను.

"నిన్న రాత్రి నువ్వన్నమాటలు విన్నాను. వాళ్ళు నన్ను చంపడానికి నిన్ను పంపించారనుకున్నాను" అన్నాడు.

నాకిప్పుడుకొంచెంకొంచెంబోధపడుతున్నది.

"వాళ్లెవరు?" అన్నాను తాపీగా.

"ఆర్డర్ నీకు చెప్పలేదా?"

"లేదు. ఈ రాత్రి నీతో పరిచయం చేయిస్తానన్నాడు."

అయిదు నిమిషాలదాకా అలాగే నావైపు చూస్తూ కూర్చున్నాడు బొమ్మలాగా. నాకా చూపు ఇబ్బందిగానే ఉంది.

"వాళ్ళెవరు?" అన్నాను మళ్లీ.

"నా నీడలు" అన్నాడాఖరికి.

"ఆ దిక్కుమాలిన కత్తి పారెయ్యి. ఇలా వచ్చి ఈ టేబిలుమీద కూర్చో" అన్నాడు. అతడి ఆజ్ఞను మన్నించి కాలులేని భాగం వదిలిపెట్టి రెండవవైపు జాగ్రత్తగా టేబిలుమీద నా శరీరం ఆన్చాను. నేలమీద ఉంచిన విస్కీ సీసా ఒకటి పైకి తీసి రెండు గుక్కలు తాగాడు. నాకు సీసా అందించబోయాడు.

"నో, థాంక్స్" అన్నాను. మళ్లీ దాన్నిపైకెత్తి మరో గుక్క తాగి సీసాను కింద ఉంచేశాడు.

"పదేళ్ళకిందటి ముచ్చట. ఇదే రాత్రి, ఇదే చలికాలం" అన్నాడు మబ్బులవంక చూస్తూ. నేను ఊకొట్టాను.


## గమనిక

సమీక్షార్థం రెండు ప్రతులు 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు-2'కు పంపవలసిఉన్నది.

—ఎడిటర్



## తెల్లమచ్చలకు ఉచిత వైద్యము

అనేక సంవత్సరములు పరిశోధన ఫలితముగా కనిపెట్టబడిన 'సోమరాజీ' ఆయుర్వేద ఔషధము తెల్లమచ్చలను నివారించును. ఒక చిన్న సీసా మందు ఉచితముగా పంపబడును. ఇంగ్లీషులో వ్రాయండి.

**Ashoka Treatment Centre (V)**
**P.O. Lal Bigha (Gaya)**


# అతనూ అతని నీడలూ

"మేము నలుగురం భాగస్తులం. ఆ రాత్రి ఒక బాంకు దోచుకోవడానికి ఏర్పాట్లన్నీ చేసుకున్నాము. వాళ్ళు ముగ్గురూ కాపలా ఉన్న ఇద్దరినీ చంపేసి, బాంకు లోపల సొమ్మంతా నా కారులో పడేశారు. ఇంకా ఒక చిన్న ఇనప్పెట్టె ఉంది. అది ఎంత ప్రయత్నించినా బద్దలు కాలేదు. అందుచేత వాళ్లు ముగ్గురూ దాన్ని అలాగే మోసుకు వచ్చి కారులో పడేయాలని లోపలికి పోయారు. ఒక నిమిషం అయింది.... రెండు నిమిషాలయ్యాయి... మూడు నిమిషాలు! ఈ లోగా నా మెదడు జోరుగా పనిచేస్తున్నది. నా వెనక సీటులో లక్షలు మూలుగుతున్నాయి. ముందర దారి నిరాటంకంగా ఉంది. కారులో కావలసినంత పెట్రోలుంది. ఆ ముగ్గురూ లోపల ఎక్కడో ఉన్నారు. మెల్లగా కారు స్టార్టు చేశాను. వీధిచివర దాకా మెల్లగా పోనిచ్చి ఒక్కసారిగా వేగం హెచ్చించాను.

"అంతే. ఆనాటినుంచి వేట ప్రారంభమయింది. ఆ ముగ్గురూ నా రక్తంకోసం నన్ను వెంటాడారు. నా స్వదేశం వదిలేశాను. కాంటినెంట్ అంతా ఈ పాపపు సొమ్ముతో తిరిగాను. చివరకు ఛానల్‌దాటి ఇంగ్లండులో తల దాచుకున్నాను కొన్నాళ్ళు. అక్కడికీ వచ్చారు వాళ్లు. వెంటనే న్యూయార్కుకు టిక్కెట్టు తీసి నాలాగే ఉన్న మరొకడికి నావేషం వేసి వాణ్ణి స్టీమరు ఎక్కించి నేను ఇండియా వచ్చేశాను. వాళ్ళు ఆ రెండవవాడే నేననుకొని న్యూయార్కు పోయారు. కాని నాకు తెలుసు. వాళ్లకు ఈ దేశం రావడానికి ఆట్టేకాలం పట్టదు."

కిందకు వంగి సీసా ఎత్తి మరికొన్ని గుక్కలు తాగాడు. సీసా అలానే రెండు చేతుల మధ్య ఉంచుకొని దాన్ని మెల్లగా నిమురుతూ మళ్లీ ప్రారంభించాడు.

"ఇన్ని సంవత్సరాలూ వాళ్లని తప్పించుకోవడంలో నేనాజీవితం అంతా నాశనం చేసుకున్నాను."

"ఇంతకీ ఆ ముగ్గురూ ఈ దేశం వచ్చారా?" అన్నాను.

"ఏమో! నాకేం తెలుసు?" అన్నాడు జుత్తు పీక్కుంటూ. "నాకుమాత్రం ప్రతి వీధి మలుపు దగ్గరా వాళ్లే కనిపిస్తారు. ప్రతిక్షణంలోనూ వాళ్ళు నా వెనకాల కూర్చున్నట్టు అనిపిస్తుంది. ప్రతి సినిమాలోనూ, ఆ గుడ్డి వెలుతురులో నా చుట్టూ ఉన్న సీట్లలో ఆ ముగ్గురి ముఖాల కోసం వెతుకుతూ ఉంటాను. నీలాగే ఒకసారి బొంబాయిలో ఒకడు తాగుడుమీది మైకంలో మాటామాటా వచ్చి నన్ను చంపుతానన్నాడు. వాడి వెనకాల ముగ్గురు దన్ను ఉన్నారన్నాడు. వాడే ఉద్దేశంతో అన్నాడో నాకు తెలీదుగాని, ఆ మర్నాడే భయంతో బొంబాయినుంచి కలకత్తా వచ్చేశాను. ఇవాళ ఆ భయంతోనే నిన్ను చంపాలనుకున్నాను. ఎముకలూ, రక్త మాంసాలూ ఉన్న మనుష్యుల ఆకారాలయితే ఫరవాలేదు. నీడలతో నే నెలా పోట్లాడేది? నా నీడలని నేనెలా తప్పించుకోగలను? చెబితే నమ్మవు. ఒకనాటి రాత్రి తప్పతాగి నా గదిలోకి వెళ్ళాను. ఎదురుగా నిలువుటద్దంలో నా ప్రతిబింబం కనుపించింది. 'ఎవరు నువ్వు?' అన్నాను. 'నాతో నీకేంపని?' అన్నాను. 'ఇక్కడినుంచి వెంటనే వెళ్లిపో. లేకపోతే నిన్ను చంపేస్తాను' అన్నాను. తలుపువారనుంచి చేతికర్రతీసి అద్దంమీద శక్తిపూరా కొట్టి, దాన్ని ముక్క ముక్కలు చేశాను. అప్పటికిగాని నాకు నిద్ర పట్టలేదు."

గుండెలోనుంచి భారంగా ఒక వేడి నిట్టూర్పు విడిచాడు.

"అయితే ఇన్ని లక్షల సొమ్మూ. . ." ఏదో అనబోయాను.

"సొమ్ము!" అని, "ఛీ" అని నేలమీద ఉమ్మాడు. "ఎడారిలో ఎప్పుడేనా నీళ్ళుపోసి పచ్చగడ్డి మొలిపించావా? నీ వయస్సెంత?"

చెప్పాను.

"నువ్వింకా జీవితంలో అడుగుపెడుతున్నావు. నీ దారిలో సొమ్మంటే ఏరుకో. కాని దాని వెనకాల మాత్రం పడకు. నాకన్నా నీకు ప్రత్యక్షసాక్ష్యం ఎవరు దొరుకుతారు? ఆ జీసస్‌ను క్షమాపణ వేడుకోవడానికి కూడా నాకు అర్హత లేదు. నాకు తెలుసు. నే నిలాగే నన్ను నేను కాల్చుకుంటూ చచ్చిపోతాను. లక్షాధికారి గాస్పెరి!" గట్టిగా నవ్వాడు. విస్కీ పనిచేస్తున్నట్టుంది.

"ఇప్పుడు ఏవీ, ఆ లక్షలు? ఏవీ?" ఒక చేత్తో సీసా పట్టుకొని రెండవ ఖాళీచెయ్యి చూచుకున్నాడు. నాకు జాలివేసి అతని భుజం మీద చెయ్యి వేశాను. నా చేతిని విదిలించాడు. "వద్దు. నాకు నీ సానుభూతి అఖ్కర్లేదు. ఇక్కడనుంచి వెళ్లిపో. నాకు మైకం వస్తోంది. వచ్చిన తర్వాత నే నేంచేస్తానో నాకే తెలీదు. మళ్లీ ఎప్పుడూ ఈ చాయలకి రాకు" అని మళ్లీ ఏదో గొణుక్కుంటూ టేబిలుమీద తలఆన్చాడు.

కొన్ని నిమిషాలు ఆగి "మిస్టర్ గాస్పెరి!" అన్నాను. చలనం లేదు.

"మిస్టర్ గాస్పెరి!" అన్నాను, ఈసారి గట్టిగా. అప్పటికీ చలనంలేదు. తాపీగా లేచాను. నాలుగడుగులు వంటింటివైపు వేశాను. అతడి చేతిలోని విస్కీ సీసా పట్టు తప్పి పెద్ద శబ్దంతో కిందపడి బద్దలైంది. అతనుమాత్రం అలాగే గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. మరొక అడుగు ముందుకువేసి కిందకు చూసుకున్నాను. మూడు నీడలు నా పాదాలనుంచి నేలమీద పరుచుకున్నాయి. ఒకటి అస్పష్టంగా, పొడుగుగా ఉంది. రెండవది నా అంత పొడుగుంది. మూడవది దట్టంగా, పొట్టిగా నా పాదం దగ్గరగా ఉంది. సమీపంలోని చర్చి గడియారం "టంగ్ టంగ్" అని రెండు గంటలు కొట్టింది.

"మై డియర్ ఫెలోస్, ఎవరయ్యా మీరు?" అని ప్రశ్నించాను నా నీడలను. అవి సమాధానం ఇవ్వలేదు. ★